క్లుప్తంగా

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

చిట్యాల: మండలంలోని నవాబుపేట, కాల్వపల్లి మానేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ఎమ్మార్పీస్ మండల అధ్యక్షుడు నెరేళ్ల ఓదేలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వానకాలంలో వాగులు వచ్చి పొలాలు అన్ని కొట్టుకపోయాయని దీంతో రైతులు ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు మరో పంట వేసుకుందా మంటే వాగులోని ఇసుకను మొత్తం అక్రమార్కులు తరలిస్తున్నారని నీటి మట్టం తగ్గి వాగులో నీరు ఉండకుండా పోతుందని అన్నారు. సంబంధిత అధి కారులు గతంతో మాదిరిగా కూ పన్లు పెట్టి ఇసుకను ఇళ్లు కట్టుకునే వారికి మాత్రమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇసుక ట్రాక్టర్లు, లా రీలు నడిపే డ్రైవర్ల మూ లంగా రోడ్డు ప్రమాదాలు జరిగి అనేక కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. అధికారులు స్పందించి ఇసుక రవాణాను అరికట్టాలని కోరారు.

మినీ స్టేడియం ఏర్పాటు చేయాలి

చిట్యాల: మండలంలోని చల్లగరిగ గ్రామంలో మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన జాతీయ స్థాయి కబడ్డీ క్రీడాకారుడు నెరేళ్ల అరుణ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చల్లగరిగ గ్రామంలో ఇంటికోక జిల్లా, జాతీయ స్థాయి క్రీ డాకారుడు ఉన్నారని అన్నారు. ప్రభుత్వం తమ గ్రా మంలో మినీ స్టేడియం ఏర్పాటు చేస్తే తమ గ్రామ యువకులు అంతర్జాతీయ స్థాయిలో కూడా రాణించే సత్తా ఉందని అన్నారు. అలాగే రాబోయో తరాల కు కుండా ఎంతగానో ఉపయోగపడు తుందన్నారు.

కమిటీ ఎన్నిక

మల్హర్: మండలంలోని నాచారం గ్రామంలో జిల్లా పెరక సంఘం ఆధ్వర్యంలో మండల పెరక సంఘం నూతన కార్యావర్గన్ని శనివారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గడి గోప్పుల రాజు, ప్రధాన కార్యదర్శిగా తీర్థాల దేవేందర్, కోశాధికారిగా ఉప్పుల చంద్రయ్య, ఉపాధ్యక్షులుగా వేరువ శ్రీనివాస్, ఉప్పుల రాజు, అర్గనైజింగ్ సెక్రటరీగా కోట్టే సతీష్, ప్రచార కార్యదర్శిగా వేరువ తిరుపతి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూరం రవీందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కారుకురి నారయణ, ఉపాధ్యాక్షులు శ్రీనివాస్, కార్య నిర్వహణ కార్యదర్శి కుమారస్వామి, సదయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

టీషర్టుల పంపిణీ



మహాముత్తారం: మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన గుగులోత్ వెంకట్‌రాం జ్ఞాపకార్థం గ్రామానికి చెందిన 22 మంది క్రికెట్, వాలీబాల్ క్రీడాకారులకు టీషర్టులకు, క్రీడాసామగ్రిని శనివారం రఘురాంనాయక్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు తదితరులు ఉన్నారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి

నర్సంపేట: రాజ్యాంగం ద్వారా లభించిన హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పసుల రామ్మూర్తి కోరారు. పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఎస్సీ రిజర్వేషన్లను పెంచాలని, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లను అమలు చేయాలని కోరారు. తెలంగాణలో ప్రస్తుత ప్రభుత్వ ఏర్పాటులో ముఖ్య భూమిక పోషించిన మాల మహానాడు నాయకులకు ప్రభుత్వ ఫలాలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

రామప్ప శిల్పకళ అద్భుతం



రామప్ప దేవాలయంలో పూజలు చేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

వెంకటాపురం(ఎం): రామప్ప ఆలయ శిల్పకళ సంపద అద్భుతంగా ఉందని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ అన్నారు. మండల పరిధిలోని చారిత్రక రామప్ప దేవాలయాన్ని వారు శనివారం సందర్శించగా వారిని పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడు కోకిల శ్రీరంగం, జిల్లా అధ్యక్షుడు కాసర్ల రమేష్ ఆధ్వర్యంలో పీఆర్‌టీయూ నాయకులు వారిని ఆలయంలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం వారు రామప్ప రామలింగేశ్వర స్వామికి పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టత గురించి గైడ్ విజయ్‌కుమార్ వివరించగా రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు రావడం గర్వించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, రాష్ట్ర నాయకులు గుర్రం చెన్న కేశవరెడ్డి, భద్రయ్య, నాగేశ్వర్‌రావు, యాకూబ్‌రెడ్డి, రాజన్న, సలేంద్రంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సమేతంగా..

రామప్ప దేవాలయాన్ని శనివారం అటవీశాఖ యాదాద్రి సర్కిల్ సీసీఎఫ్ శివాని డొగ్రా కుటుంబ సమేతంగా సందర్శించారు. రామప్ప రామలింగేశ్వరస్వామికి వారు పూజలు నిర్వహించగా ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. ఆలయ విశిష్టత గురించి గైడ్ వారికి వివరించారు. వారి వెంట ఎఫ్‌ఆర్‌ఓలు శంకర్, కొండల్‌రెడ్డి, డిప్యూటీ ఆర్‌ఓ రవికుమార్, ఎఫ్‌బీఓ రజితతో పాటు తదితరులు ఉన్నారు.



అటవీశాఖ అధికారులకు రామప్ప ఆలయ విశిష్టతను వివరిస్తున్న గైడ్ విజయ్‌కుమార్

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

వాజేడు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు అన్నారు. శనివారం మండల పరిధిలోని పెద్దగొల్ల గూడెం గ్రామ పంచాయతీలో వాజేడు ఏపీజీవీబీ శాఖ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. భారత్ సంకల్ప యాత్ర వాల్ పోస్టర్లను గ్రామస్తులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉజ్వల, శోభన్ బాబు, సత్యనారాయణ, రవి, మేనక ఉన్నారు.



పోస్టర్లు చూపుతున్న అధికారులు

రాంనాయక్‌తండాలో ముగ్గుల పోటీలు

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలం రాంనాయక్ తండాలో చెల్పూర్‌కు చెందిన మన గ్రోమోర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మన గ్రోమోర్ మార్కెటింగ్ మేనేజర్ సునీల్‌రావు విజేతలైన మహిళలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయ సంప్రదాయంలో రైతుల పంటలు చేతికి వచ్చిన ఆనంద సమయంలో సంక్రాంతి పండుగకు ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. జిల్లాలోని ప్రజలు సంక్రాంతి పండగను ఆనందంగా జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రోమోర్ బ్రాంచ్ నుంచి కుమార్, సర్పంచ్ పోరిక జగన్, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.



బహుమతులు అందిస్తున్న గ్రామస్తులు

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

గోవిందరావుపేట: మండల కేంద్రంలోని చల్వాయి గ్రామంలోని బస్టాండ్ వద్ద శనివారం సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలోని ఇప్పలగడ్డలోని పేదలకు చలి తీవ్రతను దృష్టిలో ఉంచుకోని దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. సీతక్క పంచాయత్ రాజ్ మంత్రి అయిన నెల లోపే జిల్లాకు రూ.2 కోట్ల 50 లక్షల సీసీ రోడ్లు తీసుకువచ్చిందన్నారు. జిల్లాను అభివృద్ధి చేయాలంటే అది సీతక్కతోనే అవుతుందని అన్నారు. ఇప్పలగడ్డ గ్రామంలో చాలా మంది పేదలు చలి తీవ్రతను తట్టుకోలేక ఇబ్బంది పడుతున్నారని వారిని దృష్టిలో పెట్టుకోని దుప్పట్లు పంపిణీ చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రసపుత్ సీతారాం నాయక్, తేళ్ల హరి ప్రసాద్, మల్లారెడ్డి, శ్రీకాంత్, జక్కి ప్రభాకర్ పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న అశోక్

నాణ్యతా ప్రమాణాలతో పూర్తిచేయాలి



పనులను ప్రారంభిస్తున్న రాజేందర్‌గౌడ్

ములుగు రూరల్: ప్రజల సౌకార్యర్థం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని జాకారంలో అంతర్గత సీసీ రోడ్ల ప్రారంభానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ములుగు జిల్లా నుంచి సీతక్క పంచాయితీరాజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నెల రోజుల్లో జిల్లాకు రూ. 2 కోట్ల 50 లక్షల నిధులను తీసుకొచ్చి గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణం చేపడుతుందని అన్నారు. మేడారం మహాజాతరకు ప్రభుత్వం రూ.75 కోట్లు కేటాయించి జాతరకు నెల సమయం ముందే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు పనులు ప్రారంభించారని అన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పనులను చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండా చాంద్‌పాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల్ల భరత్ కుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

కరెంటు కంచెలు ఏర్పాటు చేయొద్దు

కన్నాయిగూడెం: పంట పొలాల చుట్టూ కరెంటు కంచెలను ఏర్పాటు చేయొద్దని ఎస్సై సురేష్ అన్నారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ప్రజా ప్రతినిధులకు వివిధ సమస్యలపై ఎస్సై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. రైతులు పంట పొలాలకు అడవి జంతువుల నుంచి రక్షణ కోసం కరెంట్‌తో కూడిన ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ విషయాన్ని గ్రామాల్లోని రైతులకు తెలియజేయాలని ప్రజాప్రతినిధులను కోరారు. మండలంలో మిరప పంటలు సాగు చేసిన రైతులు కళ్లాలకు ఇసుక అవసరం ఉంటే పట్టా బుక్కుతో తహసీల్దార్ కార్యాలయంలో అనుమతులు తీసుకోవాలన్నారు.

ఏటూరునాగారం: మండలంలోని రైతులు వారి పంట పొలాలకు వన్యప్రాణుల కోసమని ఎలాంటి కరెంటు పెట్టొద్దని ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు పంట పొలాలకు విద్యుత్ పెన్సింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా అడవి జంతువుల నుంచి రక్షణ కోసం కొంత మంది రైతులు పంటపొలాలకు కరెంటుతో కూడిన ఫెన్సింగ్ వేయడం జరుగుతుందన్నారు. ఎవరైనా రైతులు రాత్రి వేళలో వారి పంట పొలాల దగ్గరికి వెళ్లే క్రమంలో అట్టి కరెంటుషాక్ గురై మృతిచెందే అవకాశం ఉందన్నారు. ఇటీవల కాలంలో ములుగు మండలంలోని ఒక రైతు రాత్రి వేళలో పంటపొలాలకు వెళ్తున్న క్రమంలో కరెంటు ఫెన్సింగ్ షాక్‌కు గురై మరణించాడని తెలిపారు. అలాగే కొంత మంది వేటగాళ్లు కూడా ఈ విధంగా కరెంట్ పెట్టి అడవి జంతువులను గతంలో వేటాడుతున్నారని సమాచారం ఉందన్నారు. కరెంటు ఉచ్చులు పెట్టి వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో జరిగే కోడిపందాల గురించి పేకాట గురించి గుడుంబా తయారీ, గంజాయి వినియోగం అమ్మకం దారుల గురించి ఏటూరునాగారం పోలీసులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. అలాంటి విషయాలు చెప్పిన వివరాలు గోప్యంగా ఉంచబడుతాయని సర్పంచ్, ఎంపీటీసీలను కోరారు. యువత గ్రామాల్లోని చెరువులు, వాగుల వద్దకు పోవద్దన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.



ఏటూరునాగారం: అవగాహన కల్పిస్తున్న ఎస్సై



కన్నాయిగూడెంలో..

ఇసుక లారీల పట్టివేత



స్టేషన్‌కు తరలిస్తున్న ఇసుక లారీలు

వాజేడు: అధిక లోడుతో వస్తున్న 11 ఇసుక లోడ్ లారీలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని అరుణాచలపురం గ్రామ సమీపంలో శుక్రవారం సాయంత్రం వాహన తనిఖీలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ క్రమంలో వెంకటాపురం(కె) మండల పరిధిలోని మొర్రవాని ఇసుక క్వారీ నుంచి వచ్చిన 11 లారీల్లో నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుక అధికంగా ఉన్నట్లు గుర్తించి వాటిని వాజేడు పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. చట్ట ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుడుంబా నియంత్రణకు సహకరించాలి

వెంకటాపురం(కె): మండలంలోని బెస్తగూడెంలో గుడుంబా నియంత్రణ ప్రతి ఒక్కరూ సహకరించాలని స్థానిక ఎస్సై అశోక్ అన్నారు. శనివారం మండల పరిధిలోని బెస్తగూడెంలో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, యవకులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో గుడుంబా తయారీ, విక్రయాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై గ్రామస్తులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ప్రతి యువకుడు యూనిఫాం లేని పోలీస్‌గా వ్యవహరించాలన్నారు. గ్రామంలో కోడి పందెలు, పేకాటపై ఎప్పటికప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు గామస్తులు సహరించాలని కోరారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై అశోక్

ఇంటింటికీ రామయ్య అక్షింతలు



వాజేడు: శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

వాజేడు: అయోధ్య నుంచి వచ్చిన రాముల వారి అక్షింతలను శనివారం మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామంలో ఇంటింటికీ పంపిణీ చేశారు. తలంబ్రాలతో గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): అమోధ్య శ్రీరాముడి అక్షింతలు శనివారం మండల పరిధిలోని ఉప్పేడు గోల్లగూడెం గ్రామానికి చేరుకున్నాయి. ఉదయం అక్షింతలను మండల కేంద్రంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి భక్తిశ్రద్ధలతో మేళతాళాల నడుమ ఊరేగింపుగా గ్రామానికి తీసుకువెళ్లారు. అనంతరం గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి గ్రామస్తులకు అక్షింతలు పంపిణీ చేశారు.



వెంకటాపురం(కె)లో..

నేడు వీరభద్రుడి ఆరాధన

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని శ్రీ అభినవ వీరభద్ర స్వామి దేవస్థానంలో శ్రీ అభినవ వీరభద్రస్వామి భద్రకాళి అమ్మవారి ఆరాధన మహోత్సవ కార్యక్రమాన్ని నేడు(ఆదివారం) నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బల్ల భద్రయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి ఆరాధన మహోత్సవం తిలకించేందుకు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. బోగి సందర్భంగా మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదాన కార్యక్రమం కలదని తెలిపారు. 15న గ్రామ పుర వీధుల్లో స్వామివారి ఊరేగింపు సేవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు గోదాదేవి రంగనాథుల కల్యాణం

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో గోదాదేవి రంగనాథుల కల్యాణ మహోత్సవాన్ని నేడు (ఆదివారం) నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మోడెం రమేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గోదాదేవి రంగనాథుల స్వామి కల్యాణం రామాయలం ఆవరణలో ఉదయం 10.30లకు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామి వారి కల్యాణాన్ని తిలకించాలని కోరారు.

ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి

గోవిందరావుపేట: పోలీస్ శాఖ వారి సూచనలు పాటించి దొంగతనాలు నియంత్రణకు మండల ప్రజలు సహకరించాలని పస్రా ఎస్సై షేక్ మస్తాన్ అన్నారు. శనివారం పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. అనుమానిత వ్యక్తులు కదలికలను గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సంక్రాంతి పండగకు ఊళ్లకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లేవారు ఇంటి చిరునామా, ఫోన్ నంబర్‌ను పోలీస్ స్టేషన్లో తెలపాలన్నారు. విలువైన వస్తువులను వెంట తీసుకెళ్లాలని, పక్కింటి వారికి ఇంటి పరిసరాలను గమనించమని చెప్పి వెళ్లాలని అన్నారు. చోరీల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టామని రాత్రి వేళల్లో గస్తీని ముమ్మరం చేశామని అన్నారు.

సర్పంచ్‌లతో సమావేశం

మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులతో పోలీస్ స్టేషన్‌లో పస్రా ఎస్సై షేక్ మస్తాన్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. కొందరు గ్రామాల్లో పంటల రక్షణ కోసం కరెంట్ తీగలు, ఉచ్చులు అమరుస్తున్నారని ఈ విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. గ్రామాల్లో కరెంటు తీగలతో కంచె ఏర్పాటు చేయాకుండా చూడాలన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి పట్టణ సమీపంలోని బాంబులగడ్డలో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని సీసీఎస్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. సీసీఎస్ సీఐ పులి వెంకట్ తెలిపిన వివరాల ప్రకారం.. బాంబులగడ్డలోని కమ్యూనిటీ హాల్ పక్కన రేకుల షెడ్‌లో సుమారు 60 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసి ఉందని సమాచారం రావడంతో పట్టుకోవడం జరిగిందన్నారు. కాలనీకి చెందిన నడ్డి రాకేష్ అక్రమంగా బియ్యం నిల్వ చేసినట్లు గుర్తించి అతడిపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.

చిట్యాలలో..

చిట్యాల: మండలంలోని జూకల్ గ్రామానికి చెందిన మాదాసు వంశీ, కొమ్ము సతీష్‌ల ఇళ్లలో సమాచారం మేరకు తనిఖీలు చేపట్టగా 15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై రమేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా పీడీఎస్ బియ్యం అక్రమంగా కొనుగోలు చేసిన, తరలించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



భూపాలపల్లి అర్బన్: పట్టుబడిన రేషన్ బియ్యం

ముగిసిన వాలీబాల్ పోటీలు



కన్నాయిగూడెం: మొదటి బహుమతి అందుకుంటున్న బుట్టాయిగూడెం టీమ్



కొంగాల జట్టుకు షీల్డు నగదు ఇస్తున్న ఎస్సై, సర్పంచ్

కన్నాయిగూడెం: మండలంలో మూడు రోజుల నుంచి బుట్టాయిగూడెం గ్రామ పంచాయతీలో ఆదివాసీ నాయకపోడు యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి వాలీబాల్ క్రీడలు శనివారం ముగిశాయి. మొదటి స్థానంలో బుట్టాయిగూడెం, ద్వితీయ స్థానంలో ఏటూరునాగారం మండలానికి చెందిన ఎక్కల టీమ్, తృతీయ స్థానంలో చిట్యాల నిలిసినట్లు యూత్ నాయకుడు గుంటి రాజు తెలిపారు. ప్రథమ స్థానం గెలుపొందిన వారికి రూ.10160 నగదు, బహుమతి, ద్వితీయ స్థానానికి రూ.5016, తృతీయ స్థానానికి రూ.3016లను స్థానిక ప్రజాప్రతినిధులు ఎస్సై సురేష్‌తో కలిసి అందజేశారు. దాతలు జాడి రామరాజు నేత మొదటి బహుమతి, ద్వితీయ బహుమతి ఎస్సై సురేష్, తృతీయ బహుమతి సర్పంచ్ కావిరి పద్మ చిన్నికృష్ణ అందజేశారు. ఈ కార్యక్రమంలో జాడి రాంబాబు, సుమన్, నర్సింహారావు, చిరంజీవి, సుధాకర్, శ్రీనువాస్, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత 'కొంగాల'

వాజేడు: వాజేడు, వెంకటాపురం(కె), ఏటూరునాగారం మండలాల స్థాయి వాలీబాల్ విజేతగా కొంగాల జట్టు నిలిచింది. నాగారం యూత్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు మూడు మండలాల స్థాయి వాలీ బాల్ పోటీలను నిర్వహించారు. ఫైనల్‌లో హోరాహోరీగా జరిగిన ఫైనల్ పోరులో ఘణపురం జట్టుపై గెలిచి కొంగాల జట్టు విజేతగా నిలిచింది. రన్నర్‌గా ఘణపురం జట్టు నిలువగా పూసూరుపై గెలిచిన నాగారం జట్టు తృతీయ స్థానంతో సరిపెట్టు కుంది. విజేతలకు ఎస్సై వెంకటేశ్వరరావు, నాగారం సర్పంచ్ తల్లడి ఆదినారాయణల చేతుల మీదుగా షీల్డులతో పాటు నగదు బహుమతులను అందజేశారు. విజేతగా నిలిచిన కొంగాల జట్టుకు రూ.15,016, షీల్డు, రన్నర్ జట్టు ఘణపురానికి ర.10016, షీల్డు అందజేశారు. అలాగే తృతీయ స్థానంలో నిలిచిన నాగారం జట్టుకు రూ.5016, షీల్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి విక్రాంత్, సీతాలు, నాగారం యూత్ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

భూపాలపల్లి రూరల్: పట్టణంలో కాకతీయ లారీ అ సోసియేషన్ కార్యాలయంలో అసోసియేషన్ క్యా లెండర్‌ను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి లారీ యాజమానుల సమస్యలను తెలిపారు. దీంతో లారీ ఓనర్ల, డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే